# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు జరిగిన మంత్రివర్గ సమావేశంలో 35 అజెండా అంశాలకు ఆమోదం లభించింది.

- ❖ ఢిల్లీలో పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈరోజు కేంద్రమంత్రులు అశ్విని వైష్ణవ్, అమిత్ షాలతో సమావేశమయ్యారు.

- ❖ విశాఖపట్టణం వేదికగా 9వ జాతీయ కరెక్షనల్ అడ్మినిస్ట్రేటర్ల సదస్సును కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు.

- ❖ "అరకు ఫెస్ట్ – 2026" రేపటి నుంచి ప్రారంభం కానుంది.

- ❖ భారత్ - న్యూజిలాండ్ జట్ల మధ్య నాలుగో టీ-20 క్రికెట్ మ్యాచ్ విశాఖలో మరికొద్ది సేపట్లో ప్రారంభం కానుంది.

==================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని సచివాలయంలో ఈరోజు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశ వివరాలను సమాచార, ప్రజా సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పాత్రికేయులకు వెల్లడించారు. సమావేశంలో ప్రధానంగా 35 అజెండా అంశాలకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు. పలు జలవనరుల ప్రాజెక్టులకు సంబంధించి ఆర్థిక అనుమతులకు, ఇంధన శాఖలో పరిపాలన అనుమతులకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. పిడుగురాళ్ల వైద్యకళాశాలను పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు, పలమనేరులో లైవ్‌స్టాక్ రీసెర్చ్ స్టేషన్ ఏర్పాటుకు భూ బదలీ ప్రతిపాదనకు ఆమోదం లభించిందన్నారు. ఏపీ టిడ్కోకు హడ్కో నుంచి 4 వేల 451 కోట్ల రూపాయల ప్రభుత్వ రుణ గ్యారెంటీని మంత్రివర్గం ఆమోదించిందని చెప్పారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని 33 ఎకరాల భూమిని వ్యవసాయ మార్కెట్ కమిటీకి బదలీ చేసే అంశంపై చర్చించిందన్నారు. మరిన్ని వివరాలను మంత్రి పార్థసారథి వెల్లడిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

==================

పిఠాపురం రైల్వే స్టేషన్ ను మోడల్ స్టేషన్ గా అభివృద్ధి చేయాలని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్... రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఉప ముఖ్యమంత్రి ఈరోజు కేంద్రమంత్రితో సమావేశమై.. పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి, రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు పలు అంశాలపై చర్చించారు. సేతు బంధన్ పథకం కింద మంజూరు చేసిన రోడ్డు ఓవర్ బ్రిడ్జిని పీఎం గతిశక్తి పథకం పరిధిలోకి తీసుకురావాలని కోరారు. ఇది 2030 జాతీయ రైల్ ప్రణాళికకు అనుగుణంగా లెవల్ క్రాసింగ్‌లు తొలగించేందుకు, ట్రాఫిక్ నియంత్రణకు సహకరిస్తుందని తెలిపారు. పిఠాపురం ఆధ్యాత్మిక కేంద్రమని, రైల్వే స్టేషన్ ను అమృత్ పథకం కింద మోడల్ రైల్వే స్టేషన్ గా అభివృద్ధి చేయాలని కోరారు. అష్టాదశ శక్తిపీఠం, శ్రీపాద శ్రీవల్లభ స్వామి కొలువైన క్షేత్రం పిఠాపురంలో ఉన్నందున దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పించాలని పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు. అనంతరం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు.

==================

బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (BPRD), ఆంధ్రప్రదేశ్ జైళ్లు, కరెక్షనల్ సర్వీసెస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న 2 రోజుల 9వ జాతీయ కరెక్షనల్ అడ్మినిస్ట్రేటర్ల సదస్సును కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విశాఖపట్నంలో ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జైళ్ల శాఖ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చినప్పటికీ, జైళ్ల మెరుగుదల, ఖైదీల సంక్షేమం, మహిళల సంక్షేమం కోసం కేంద్రప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఖైదీల భద్రత, సంక్షేమం కోసం 160 కోట్ల రూపాయలు కేటాయించిందని, `పేద ఖైదీలకు మద్దతు` పేరిట వారిక సహాయం అందించేందుకు ప్రభుత్వం సంవత్సరానికి 20 కోట్ల రూపాయలు కేటాయించిందని చెప్పారు. ఖైదీలు విడుదలైన తర్వాత గౌరవప్రదమైన జీవితాలను గడిపే వాతావరణం ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని బండి సంజయ్ కుమార్ వెల్లడించారు.

==================

‘అరకు ఫెస్ట్ - 2026’ ఉత్సవాలు రేపటి నుండి వచ్చే నెల 1వ తేదీ వరకు జరుగుతాయని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ తెలిపారు. అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్సవాల పోస్టర్‌ను ఎస్పీ అమిత్ బర్దర్, పాడేరు ఆర్డీవో ఎం.వి.ఎస్. లోకేశ్వరరావులతో కలిసి ఆయన ఈరోజు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గిరిజన సంస్కృతిని, అరకు అందాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ ఉత్సవాలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం అరకులో ఉత్సవాలను అధికారికంగా ప్రారంభిస్తారని, అనంతరం ఆయన చొంపి గ్రామాన్ని సందర్శించి.. అక్కడ అమలు చేస్తున్న హోమ్ స్టే పాలసీని పరిశీలించనున్నారని కలెక్టర్ తెలియజేశారు.

విరామం

==================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులపై సచివాలయంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ పోర్టుల నుంచి రైల్ కనెక్టివిటీ, తెలంగాణా, కర్నాటక, చత్తీస్ గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన హింటర్ ల్యాండ్ నుంచి రైల్ రవాణాపై సమీక్షలో చర్చించారు. రాయలసీమ ప్రాంతాల నుంచి కోస్తాంధ్రలోని వివిధ ప్రాంతాలకు కనెక్టివిటీపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. విజయవాడ బైపాస్, భద్రాచలం రోడ్-కొవ్వూరు సహా రాష్ట్రంలో వివిధ కొత్త రైల్వే మార్గాలకు సంబంధించిన ప్రతిపాదనల పైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. విశాఖపట్టణం, విజయవాడ, గుంతకల్, గుంటూరు, రేణిగుంట తదితర రైల్వే జంక్షన్లలో రద్దీ తగ్గించే అంశంపైనా సమీక్షించారు.

===================

గిరిజన, మారుమూల గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి తెలిపారు. కురుపాం నియోజకవర్గం కొమరాడ మండలంలో గల పలు రహదారి పనులకు ప్రభుత్వ విప్, కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరితో కలిసి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. 23 కోట్ల 44 లక్షల రూపాయల వ్యయంతో 11 గ్రామాల్లో 60 బీటీ రోడ్లకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎన్నో దశాబ్దాలుగా రవాణా సౌకర్యం లేని గ్రామాలకు రహదారులు వస్తాయని చెప్పారు. వీటి నిర్మాణం పూర్తయ్యాక గిరిజన ప్రాంత గ్రామాలకు రాకపోకలు సులభతరం అవుతాయని, అత్యవసర సమయాల్లో వైద్య సేవలు త్వరితగతిన అందుతాయని కలెక్టర్ వెల్లడించారు.

===================

కొబ్బరి ఆధారిత పరిశ్రమల స్థాపన ద్వారా వార్షిక వృద్ధి రేటు 15 శాతం సాధించేలా అధికారులు కృషి చేయాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ కోరారు. ఉద్యాన, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులతో కొబ్బరి ఉత్పత్తుల దిగుబడి, మార్కెటింగ్, తదితర అంశాలపై ఆయన ఈరోజు సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో కొబ్బరి దిగుబడిని పెంచడమే కాకుండా, సమర్థవంతమైన మార్కెటింగ్ విధానాల ద్వారా రైతులకు లాభదాయకమైన ధరలు లభించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మామిడికుదురు, ఉప్పలగుప్తం  మండలాల్లో కొబ్బరి విలువ ఆధారిత ఎం.ఎస్.ఎం.ఈ. పార్కులు నెలకొల్పేందుకు ప్రభుత్వం వేగవంతంగా చర్యలు తీసుకుంటోందన్నారు.

===================

భారత్- న్యూజిలాండ్ జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ-20 సిరీస్‌లో భాగంగా నాలుగో టీ-20 క్రికెట్ మ్యాచ్ విశాఖపట్నం వేదికగా మరికాసేపట్లో ప్రారంభం కానుంది. తొలి మూడు మ్యాచ్ లలో విజయం సాధించడంతో ఇప్పటికే సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్ ఈ మ్యాచ్ లో కూడా గెలుపొందేందుకు సిద్ధమవుతోంది. నగరంలోని ఏసీఏ -వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది.

===================

ఆంధ్రప్రదేశ్, మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్యం, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని కోస్తాంధ్ర, యానాం, దక్షిణ  కోస్తాంధ్ర ప్రాంతాల్లో ఈరోజు, రేపు పొడి వాతావరణం ఏర్పడవచ్చని పేర్కొంది. ఒకటి, రెండు చోట్ల పొగమంచు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారిణి జి. లక్ష్మి వెల్లడించారు.

===================

శ్రీకాకుళం జిల్లాలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకూర్మంలోని శ్రీకూర్మనాథ స్వామి ఆలయ అభివృద్ధికి 10 కోట్ల రూపాయల వ్యయంతో సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసినట్టు శాసనసభ్యుడు గొండు శంకర్ తెలిపారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవతో... ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో సామాజిక బాధ్యత నిధులతో ఈ క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఇండిగో సంస్థ ప్రతినిధులు, ఆర్కిటెక్టులతో కలిసి ఆయన ఈరోజు ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తొలి విడతగా ఇండిగో సంస్థ 3 కోట్ల రూపాయలను విడుదల చేసిందని, దశల వారీగా మిగిలిన నిధులు అందుతాయని చెప్పారు. ఈ నిధులతో శ్వేత పుష్కరిణి అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, భక్తుల వసతులే లక్ష్యంగా పనులు సాగనున్నాయని వెల్లడించారు.

===================

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ కేంద్రాలపై కేసులు నమోదు చేయాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన పిసి అండ్ పి.ఎన్.డి.టి. యాక్ట్ అమలుపై జరిగిన అంతరాష్ట్ర సరిహద్దు జిల్లాల సమన్వయ కమిటీ సమావేశంలో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, వాటిని నిరోధించేందుకు మరింత నిఘా పెంచడంతో పాటు, పెద్ద ఎత్తున డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

===================

===================